క్లుప్తంగా

జిల్లా పరిషత్‌లో ఏడుగురికి పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జిల్లా పరిషత్ చైరపర్సన్ సుభద్ర

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో పలువురు ఉద్యోగులు పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన వారికి జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పోస్టింగ్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న ఏడుగురికి రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని సుభద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, పరిపాలన విభాగం సెక్షన్ ఆఫీసర్ మంజులవాణి, కార్యాలయ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయం ప్రారంభం



గణేశ్వర పాఠశాలలో కార్యాలయం ప్రారంభిస్తున్న డీఈవో చంద్రకళ

జగదాంబ: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో తర్ఫీదు పొందడం వల్ల విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు ఫ్రూట్ మార్కెట్ దరి గణేష్ పాఠశాల ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా నూతన కార్యాలయన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త కార్యాలయానికి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రకాశరావు, కార్యదర్శి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ భూ సమేత శ్రీనివాస కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీ భూ సమేత శ్రీనివాసుడు

అల్లిపురం: వేంకటేశ్వరమెట్టపై గల అలివేలు మంగమ్మ ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం సాయంత్రం శ్రీ భూ సమేత శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పొనంగిపల్లి రంగనాథాచార్యులు, పొనంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా వివాహ తంతు నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం ముత్యాల తలంబ్రాల వేడుక కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. వారికి వేదాశీర్వాదాలు అందించి కల్యాణ తలంబ్రాలు ప్రసాదంగా అందజేశారు.

23న ఇంద్రజాలికుల దినోత్సవం

మద్దిలపాలెం : ఈ నెల 23న ఇంద్రజాలికుల దినోత్సవాన్ని విశాఖ వ్యాలీ స్కూల్‌లో నిర్వహించనున్నట్టు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ ఇంద్రజాలికుడు పద్మశ్రీ పి.సి.సర్కార్ జయంతిని పురస్కరించుకుని జరిగే ఈ వేడుకల్లో గోపాలపట్నానికి చెందిన సీనియర్ ఇంద్రజాలికుడు ఎస్.కె.అన్వర్‌బాషా ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

నిరుద్యోగులకు వరం.. బీసీ స్టడీ సర్కిల్

- పోటీ పరీక్షలకు ఉచిత తర్ఫీదు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో శిక్షణ తరగతులు పునఃప్రారంభం



అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న డైరెక్టర్



స్టడీ సర్కిల్‌లో శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థులు

ఎంవీపీ కాలనీ: నిరుద్యోగుల పాలిట వరంగా మారింది ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర నిరుద్యోగులకు ఈ కేంద్రం వెలుగులు పంచుతోంది. కేంద్రం, రాష్ట్ర స్థాయిల్లో జరిగే పలు పోటీ పరీక్షలకు అర్హులైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. నిష్ణాతులైన అధ్యాపకుల శిక్షణలో వందలాది మంది నిరుద్యోగులు తమ కలలను సాకారం చేసుకున్నారు. 2014 నుంచి టీడీపీ హయాంలో ఈ స్టడీ సర్కిల్ సేవలు క్రమంగా నిలిచిపోవడంతో ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరుస శిక్షణలకు అనుమతులు ఇవ్వడంతో బీసీ స్టడీ సర్కిల్‌కు కొత్త జోష్ వచ్చింది.

గ్రూప్–2 ప్రిలిమ్స్‌కు శిక్షణ

ప్రస్తుతం ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–2 పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులకు ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న 70 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. 50 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు జరగనున్నాయి. అన్ని సబ్జెక్టుల్లో నిష్ణాతులైన నిపుణులతో అభ్యర్థులకు శిక్షణ అందిస్తున్నారు. గ్రూప్స్‌తో పాటు బ్యాంక్ క్లర్క్, ఎస్‌ఐ, కానిస్టేబుల్, సివిల్ జడ్జి వంటి పలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను స్టడీ సర్కిల్‌లోని లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. దీంతో పాటు ప్రస్తుతం గ్రూప్–2 ప్రిలిమ్స్‌కు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు రూ.1500 స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కోసం మరో రూ.1000 ప్రభుత్వం తరఫున అందజేయనున్నారు.

నిరుద్యోగుల అభ్యున్నతే లక్ష్యంగా..



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల అభ్యున్నతే లక్ష్యంగా సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సేవలు అందిస్తున్నాం. గ్రూప్–2, 3, 4లతో పాటు బ్యాంక్స్, దేవదాయ శాఖ ఈవో, తదితర పలు ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నాం. నిరుద్యోగ అభ్యర్థులకు శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌కు నిధులు, స్టైఫండ్ కూడా ప్రభుత్వం అందిస్తుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.శ్రీదేవి, డైరెక్టర్, గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మహిళా ఉద్యోగుల కోసం రోటరీక్లబ్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స ద్వారా నివారించవచ్చన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇటీవల జరిగిన అధ్యయనం ప్రకారం భారత్‌లో ప్రతి లక్ష మందిలో 13 మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. స్వీయ రొమ్ము పరీక్ష చేయడం, క్షమరాహిత్యం ఉన్నట్టయితే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలన్నారు. 30 ఏళ్ల పైబడిన వారిలో ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. స్వీయ పరీక్షల ద్వారా చిన్నచిన్న గడ్డలను గుర్తించి తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది మహిళా ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, లైఫ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ సుమన్, ప్రెసిడెంట్ డీఎం రావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరస్వతి భాయి, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

22న సహస్ర తులసిపూజ

కనక మహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 22న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజా రుసుము రూ.1500 చెల్లించి దంపతులు ఈ ప్రత్యేక పూజలో పాల్గొనవచ్చని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

వైభవంగా నీలమాంబేశ్వరి పరస మహోత్సవం



ఎమ్మెల్యే గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు



నీలమాంబేశ్వరి అమ్మవారు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట యాతపేట రోడ్డులో వెలసిన నీలమాంబేశ్వరి అమ్మవారి వార్షిక పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు దర్శించుకుని పూజలు చేశారు. ఈ మేరకు ఆయనకు ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు, అనిల్‌కుమార్, అప్పారావు, చలపతి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో, పూల కిరీటంతో సత్కరించారు. యాతపేట, కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట, జెండాచెట్టు తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నీలమాంబేశ్వరి అమ్మవారి ప్రధాన పండగ సందర్భంగా సాయంత్రం పరస మహోత్సవం పులివేషాలు, తప్పిటగుల్లు, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రేలా రే రేలా కార్యక్రమం, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి, పరదేశమ్మ గుడి వద్ద దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యలు పరిష్కరించారు. మరికొన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయ కమిటీ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ

విశాఖ లీగల్: ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలని విశాఖ జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ కోరారు. మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జిల్లా కోర్టులోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సామాజిక న్యాయ ఫలాలకు దూరం కాకూడదన్నారు. సీనియర్ న్యాయవాది ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ అవసరమైన సేవలను ఇంటి వద్దకే అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి ఎంఎస్ శోభారాణి, పరిపాలన అధికారి ఎస్ఎస్ఎస్ఎన్ శర్మ, అధికారులు ఆంజనేయులు, ఎస్.చిన్నారావు, శ్యామల, సహాయ సంక్షేమ అధికారి పూర్ణిమ దేవితో పాటు అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లా అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు

డాబాగార్డెన్స్: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వానికి కేజీహెచ్ విశ్రాంత అధికారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధి తాళాబత్తుల అప్పలాచారి దరఖాస్తు చేశారు. ఈ మేరకు విజయవాడ గాంధీభవన్‌లో విశ్వబ్రాహ్మణుల సంఘీయులతో కలిసి ఆయన తన దరఖాస్తును కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్, ఏఐసీసీ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీరామ్‌కు మంగళవారం అందజేశారు. అనంతరం అప్పలాచారి మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక జనాభా గల విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన తనకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తే విజయం సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు, డాక్టర్ అవినాష్, కోసూరి విజయభాస్కర్, మునపర్తి చంటిబాబు, ఎం సూర్యసాయి పాల్గొన్నారు.

మొక్కలకు అంటు కట్టడడంపై 25న శిక్షణ



మాట్లాడుతున్న గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : కూరగాయలు, మొక్కలకు అంటు కట్టే ప్రక్రియపై ఈ నెల 25న సింహాచలం గోశాల ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్టు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధి దాట్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. శివాజీపాలెంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25వ తేదీ ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు లేకుండానే ఇంటి వద్ద పంట సాగు ఎలా చేసుకోవాలనేది వివరిస్తామన్నారు. ఈ శిక్షణలో పాల్గొనేవారు తమ వివరాలను వాట్సాప్ నంబర్లు 9866138129, 9966651052లలో తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపకుడు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫిజికల్ కెమికల్, బయోలాజికల్ సైన్స్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో మిస్సో పోరస్ పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, ఏయూ విశ్రాంత వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సమస్యల పరిష్కారం కోసం ధర్నా



సభలో మాట్లాడుతున్న ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు

మహారాణిపేట: తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఎన్‌జీవో హోమ్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యచరణ వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో జేఏసీ జిల్లా చైర్మన్, ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు అనేక డిమాండ్ల సాధన కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ నెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ రొంగలి రవి శంకర్, వివిధ సంఘాల నాయకులు కె.శ్రీనివాస్(ఏపీటీఎఫ్), డి.డి.ప్రసాదరావు(పెన్షనర్ల సంఘం), ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ జోనల్ సెక్రటరీ మూర్తి, ఏపీటీఎఫ్ స్టేట్ సెక్రటరీ ఎ.ఎస్.నాయుడు, డీటీఎఫ్ జనరల్ సెక్రటరీ ధర్మేంద్ర రెడ్డి, యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం విఫలమే టీడీపీ ఓటమికి నిదర్శనం

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ



లక్ష్మీటాకీస్ వద్ద వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 29, 30 31,35 39 వార్డులకు సంబంధించి లక్ష్మీటాకీస్ వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ దక్షిణంలో లోకేష్ నిర్వహించిన శంఖారావం సభ విఫలమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు శంఖారావం సభ విఫలమే నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులు ప్రజలు గమనిస్తున్నారన్నారు. నాలుగేళ్ల పాలన చూసిన ప్రజానీకం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం ప్రజాదర్బార్‌లో స్వీకరించిన వినతులపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేటర్లు, మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, స్టేట్ డైరెక్టర్లు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం

మత్స్యకార కుటుంబాలకు అండగా ఉంటూ వారి అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మత్స్యకారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్‌ల ఆధునికీకరణ వంటి ఎన్నో పనులు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దేందుకు, విద్యార్థుల్లో మంచి ప్రవర్తన, నడవడిక, పెద్దలపై విధేయత కలిగి ఉండేందుకు మంచి పుస్తకాలు, రచనలు అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ బాల్యం విభాగంలో విధులు నిర్వహిస్తున్న మోహన్‌కుమార్ అవుపాటి రచించిన 'ఎన్సూరింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఎర్లీ ఎడ్యుకేషన్' పుస్తకాన్ని మంగళవారం మేయర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు మంచి నడవడిక కల్గి ఉండే రచనలు, పుస్తకాలు అవసరమన్నారు. ఈ పుస్తకం ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ సెంటర్ నెంబర్ (ఐఎస్‌బీఎన్)పొందడంతో పాటు 'పెన్స్ ఆఫ్ హానర్' అవార్డు దక్కించుకుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా మరిన్ని రచనలు చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్‌ను మేయర్ అభినందించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు నియామకం



సభ్యులతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి,

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు ఎట్టకేలకు కొలువుతీరింది. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కార్యనిర్వహణాధికారి రమాబాయి, కొత్తగా నియామకమైన ట్రస్ట్ బోర్డు సభ్యులు, అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండపంలో కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే గణేష్‌కుమార్ సమక్షంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి ప్రమాణస్వీకారం చేయించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొడ్డేటి కిషోర్, సభ్యులు పార్లేటి ఊర్వశి, తాడ్డి అనురాధ, కొణతాల కృష్ణవేణి, గంగుల మానస, కొల్లి సత్యవతి, వలిశెట్టి లక్ష్మిని ఎమ్మెల్యే గణేష్‌కుమార్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి కమిటీ కృషి చేయాలన్నారు. ఆలయ ప్రతిష్టను మరింత పెంచేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొడ్డేటి కిషోర్ మాట్లాడుతూ కష్టపడిన వారిని గుర్తించి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే వాసుపల్లికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు



అమ్మవారి సన్నిధిలో చైర్మన్, ఈవో, తదితరులు



అలంకరణలో బల్లిగిరి వేంకటేశ్వర స్వామి

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి సన్నిధిలో భీష్మ ఏకాదశి పర్వదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, గొలగాని వీరారావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, కార్యానిర్వహణాధికారి జి.రమాబాయితోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిహర నామ సంకీర్తన ఏకాహ మహోత్సవాన్ని ప్రారంభించారు. దొండపర్తి ప్రాంతమంతా కోలాహలంగా కనిపించింది. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: భీష్మ ఏకాదశి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుష్పమాలికలు, తులసి మాలలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు చేశారు. అల్లిపురం మెయిన్‌రోడ్డు కోదండ రామాలయం, కుమ్మరవీధి రామాలయం, గోవింద్ రోడ్డు దేవాలయం, మెయిన్‌రోడ్డు శ్రీ రామాలయంలో విశేష పూజలు నిర్వహించారు.